నేటి దినపత్రిక

17వ

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

ఆదివారం,22 సెప్టెంబర్ 2024




## ఢిల్లీలో వరల్డ్ ఫుడ్ ఇండియా ప్రదర్శనలో ఏలూరు జిల్లా ఆహార ఉత్పత్తులు





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** వరల్డ్ ఫుడ్ ఇండియా పేరిట భారతదేశ రాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్న ప్రదర్శనలో ఇతర దేశాలతో పాటు ఏలూరు జిల్లా ఆహార ఉత్పత్తులు ప్రదర్శించబడటం ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. ప్రపంచ దేశాలన్నీ కలిసి నిర్వహిస్తున్న ప్రపంచ ఆహార కార్యక్రమ నిర్వహణకు 2024 సంవత్సరం భారత దేశం వేదికగా నిలిచింది. సెప్టెంబర్ 19 తేదీనుంచి 22వ తేదీ వరకు ఢిల్లీలో ఈ కార్యక్రమం వరల్డ్ ఫుడ్ ఇండియా పేరుతో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు తమ ఆహార ఉత్పత్తులు ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 10 జిల్లాలు ఎంపిక కాగా , వాటిలో ఏలూరు జిల్లా , కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామానికి చెందిన మథర్ థెరిసా మహిళా స్వయం సహాయక సంఘ అధ్యక్షురాలు తోట కృపామణి తయారు చేస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తులు ప్రదర్శనకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.ఈ ఉత్పత్తుల ప్రదర్శనను తొలి రోజు కేంద్ర ఆహార శుద్ధి శాఖా మాత్యులు చిరాగ్ పాశ్వాన్ ప్రారంభించగా రెండో రోజు శనివారం ఆంధ్ర ప్రదేశ్ ఆహార శుద్ధి శాఖా మంత్రి టి. భరత్ రాష్ట్ర స్టాల్స్ తిలకించి అభినందించడం జరిగింది.ఢిల్లీ వరకు మన జిల్లా ఉత్పత్తులు వెళ్లటానికి కృషి చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డా.ఆర్.విజయ రాజుని, జిల్లా జీవనోపాధుల విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనితని, మహిళా గ్రూపులు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విజయ కుమారిని వెలుగు సిబ్బందిని, ఉత్పత్తులు తయారు చేసిన తోట కృపామణిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

### రానున్న ఐదేళ్లల్లో 20లక్షల మందికి

# ఉద్యోగావకాశాలు

- సాఫ్ట్వేర్, పరిశ్రమల అభివృద్ధికి చర్యలు
- మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** రాబోయే 5 సంవత్సరాలలో రాష్ట్రంలోని యువతకు 20లక్షల ఉద్యోగఅవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు.ఈ పేదల ఆకలిని తీర్చేందుకు 5రూపాయలకే నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్నా క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసినవెంటనే 16వేల700టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించారని,వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించే నాటికి కొత్తగా నియామకం చేసిన ఉపాధ్యాయులు బాధ్యతలు చేపడతారన్నారు. దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ చేస్తామని, మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం పథకంను అమలు చేస్తామన్నారు.గత ప్రభుత్వం సాగునీటిశాఖను,లక్షలఎకరాలకు సాగు నీటిని అందించే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పరిశ్రమల ఏర్పాటును నిర్లక్ష్యం చేసిన కారణంగా అభివృద్ధి కుంటుపడిందని, సరైన రోడ్ల సౌకర్యాలు లేని కారణంగా ఎంతోమంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ముందుకు రాలేదన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండారాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పెట్టేందుకు ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో రానున్న ఐదేళ్లల్లో 20లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సాఫ్ట్వేర్ రంగాన్ని రాష్ట్రంలో అభివృద్ధిలోకి తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ట్రిబుల్ ఐటీ లో ఇంక్యూబెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి పార్థసారథి తెలియ జేసారు. ఈ సందర్భంగా తనను కలిసి సమస్యలను తెలిపిన ప్రజలను ఉద్దేశించి మంత్రిమాట్లాడుతూ 8వవార్డులో ప్రజల ఉపయోగార్థం కమ్యూనిటీ హాలులో నిర్మిస్తానని, అర్హులైన ప్రతీ కుటుంబానికి పక్కా గృహం మంజూరు చేస్తానని, నూజివీడు పట్టణంలో ఎక్కడా త్రాగునీరు సమస్య లేకుండా చూస్తానని,అవసరమైనప్రదేశాలలోబోర్లు ఏర్పాటుచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.నూజివీడు మార్కెట్‌యార్డ్‌ను2కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తానని, యార్డులో వాణిజ్య కార్యకలాపాల ద్వారా మరింత మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వీలు అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ రామిశెట్టి త్రివేణి దుర్గ,మునిసిపల్ కమీషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి,డీఈ లక్ష్మీ నారాయణ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ప్రముఖులు బర్మా ఫణిబాబు, కాపా శ్రీనివాసరావు , తలపంటి రాజశేఖర్, చెరుకూరి దుర్గాప్రసాద్,మున్సిపల్అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌ను కలిసిన చాగంటి



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్‌ని మంగళగిరి జనసేనపార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కొద్దిసేపు రాష్ట్రరాజకీయాలపై వారిరువురూ మాట్లాడుతున్నారు.

# వంద రోజుల పాలనలో వేయి అడుగులు ముందుకు







### దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం
### రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి
### డాక్టర్ నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గంలో ఇది మంచి ప్రభుత్వం అంటూ వేలాదిమంది రైతులు 100 మీటర్ల పచ్చని జెండాతో జరిపిన భారీ ర్యాలీలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి రంగరాజు రైసు మిల్లు నుంచి భగేశ్వరం వరకు జరిగిన ర్యాలీలో రైతులు పచ్చని జెండాలు చేతబట్టి దాదాపు మూడు కిలోమీటర్లు పొడవునా నడిచారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల కటౌట్ కు రైతులతో కలిసి మంత్రి రామానాయుడు ధాన్యాభిషకం జరిపారు.అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో రైతులకు ఇన్పుట్ సబ్సిడీ 20 వేల రూపాయలు పెంచి అందజేసే వారమని,గత ప్రభుత్వం 16 వేలు రూపాయలకు తగ్గించి రైతులకు దగా చేశారన్నారు. తిరిగి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకహెక్టారుకు25 వేల రూపాయలకు పెంచామని మంత్రి అన్నారు. దీపావళి పండుగ కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండరు అందిస్తామని, సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తామన్నారు..కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావొస్తోందని, పాలనాపరంగా వెయ్యి అడుగులు ముందుకు వేశామన్నారు.ప్రజల కోసం నిరంతరం పనిచేస్తే పాలన ఎలా ఉంటుందో ఈ వంద రోజులు పాలన ఒక ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు. యువత గంజాయి మత్తు పదార్థాల భారీన పడుట గత ప్రభుత్వం కారణమన్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపి యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించడం మా ప్రథమ కర్తవ్యం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పింఛన్లు స్వయంగా ఇళ్లకు వెళ్ళి పంపిణీ చేసిన ఘనత భారతదేశంలో మన రాష్ట్రానికే దక్కిందన్నారు. వాలంటీర్లు లేకుండా పింఛన్లు ఇవ్వలేరని ప్రచారం చేశారని, సచివాలయాలు, బ్యాంకులు చుట్టూ వృద్ధులను తిప్పి 35 మంది ప్రాణాలు తీశారంటూ మంత్రి గుర్తు చేసారు. కూటమి ప్రభుత్వం రాగానే వాలంటీర్లు లేకుండానే ప్రభుత్వ యంత్రాంగం సహాయంతో ఒకే రోజులో పింఛన్లు పంపిణీ చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు, పెన్షన్ దారులకు ఒకటవ తేదీన జీతాలు అందుతున్నాయన్నారు. ల్యాండ్ టైటిలింగు యాక్ట్ కూడా రద్దుచేశామని,ఇదొక భయంకరమైన చట్టమన్నారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్లురద్దుచేసి పేదల పొట్టగొట్టారని, అందుకే నాలుగవ సంతకంలో భాగంగా 100 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశామని అన్నారు.

అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం రైతులకు బకాయిలు రూ 1,670 కోట్లు చెల్లించినట్లు రైతులకు చెల్లించామన్నారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోతే గత ముఖ్యమంత్రి కనీసం అక్కడికి పరిశీలన గాని, పరామర్శించుట గాని చేయలేదన్నారు.పులిచింతల గేటు కొట్టుకుపోతే రెండు సీజన్ల పాటు గేటు ఏర్పాటు చేయలేదని మంత్రి అన్నారు. గుండ్లకమ్మ గేటు, తుంగభద్ర గేటు కొట్టకు పోయాయని సాగుకు నీళ్ళు ఇవ్వలేమని అధికారులు ప్రకటించారు కాని ముఖ్యమంత్రి ఆదేశాలతో గేట్ల అమరిక నిపుణులు కన్నయ్య నాయుడుని పంపి గేటు ఏర్పాటు చేసి నీటి వృధాను అడ్డుకున్నామని మంత్రి తెలిపారు. విజయవాడ కలెక్టరేటులో ముఖ్యమంత్రి పది రోజులు మకాం వేసి పరిస్థితులు సాధారణ స్థితికి తీసుకువచ్చారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి పండుగ రోజున మొదటి గ్యాస్ అందిస్తామనిమంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు అంగర రా మ్మోహన్, తహశీల్దారు వై.దుర్గా కిషోర్,యంపిడివో సంగాని వెంక టేశ్వర రావు,నాయకులు జీవి, పెచ్చెట్టి బాబు,ఉన్నమట్ల కబర్థి,కోడి విజయభాస్కర్,మామిడిశెట్టి పెద్దిరాజు, యర్రంశెట్టిపద్మారావు,ధానాని సూర్యప్రకాశరావు, గొట్టుముక్కల సూర్య నారాయణ రాజు, మహ్మద్ జానీ, పాముల రజనీ కుమార్,బోణం నాని, చినమిల్లి గణపతిరావు, కడలి గోపాలరావు,పీతల శ్రీనివాసు,సమన్వయ కమిటీ సభ్యులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, రైతులు,ప్రజలు, సంఖ్యలో హాజరయ్యారు.

### లడ్డు రాజకీయాన్ని

# దేవుడు క్షమించడు

### ఆలయాల పనులు రద్దు చేస్తే బిజెపి ఏం చేస్తోంది?

**మాజీ డిప్యూటీ సీఎం,దేవాదాయ శాఖ మాజీ మంత్రి 'కొట్టు'**



**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న లడ్డు రాజకీయాన్ని దేవుడు క్షమించడని రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతి లడ్డు తయారీలో ఉపయోగించే నెయ్యి కల్తీ జరిగితే సంబంధిత బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకానీ ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఆ నెపాన్ని మోపి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాధ్యుడు అన్నట్లుగా చిత్రీకరించడం తగదని సూచించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని, నిజంగా నెయ్యి కల్తీ జరిగి ఉంటే దానిని సరఫరా చేసిన కాంట్రాక్టర్ పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానీ చంద్రబాబు హిందువుల మనోభావాలు దెబ్బ తినే విధంగా రాజకీయ కుట్రతో మాట్లాడి ఘోరమైన తప్పిదం చేశారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి, దేవాదాయ మంత్రిగా తాను అధికారంలో ఉండగా రాష్ట్రంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మకమైన నిర్ణయాలతో దేవాదాయ శాఖను అభివృద్ధి చేశామని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల కాలంలోనే దేవాదాయ శాఖను భ్రష్టు పట్టించిందని విమర్శించారు.

తమ హయాంలో 600 కోట్ల రూపాయలు సిజిఎఫ్‌నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పాత ఆలయాల పునర్నిర్మాణం, నూతన ఆలయాల నిర్మాణం పనులను చేపట్టామని గుర్తు చేశారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఒకో ఆలయానికి 10 లక్షల రూపాయలు చొప్పున 4100 ఆలయాలను నిర్మాణం తల పెట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేవదాయ శాఖ సమీక్షలో గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఆలయాల నిర్మాణాల పనులను రద్దు చేయాలని చెప్పడం పట్ల కూటమిలో భాగస్వామి పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ ఎందుకు నిలదీయదని కొట్టు ప్రశ్నించారు.

దేవాలయ భూములు పరిరక్షణకు దేవాదాయ చట్టంలోని 83వ సెక్షన్ సవరించి ఆస్తులకు రక్షణ కల్పించామన్నారు. నెయ్యిలో కల్తీ జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోకుండా రాజకీయం చేయాలనుకోవడం చంద్రబాబు నీచాతి నీచమైన రాజకీయాలకు నిదర్శనమని మాజీ మంత్రి కొట్టు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి 1100 కోట్ల రూపాయలు విలువైన పనులు మంజూరు చేయించానని, ప్రస్తుత ఎమ్మెల్యే వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తే బాగుంటుందని సూచిం చారు.

"మన తాడేపల్లిగూడెం-మనంబాగుచేసుకుందాం"అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముప్పిడి సంపత్ కుమార్, కొలుకులూరి ధర్మరాజు, జడ్డు హరిబాబు, వెలిశెట్టి నరేంద్ర కుమార్, గోక వెంకటేశ్వరరావు బొద్దాని శ్రీనివాస్, దాసి బాబు, సిర్రాపు శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పనితీరు అందరికి స్ఫూర్తినిస్తుంది...

### ఇది మంచి ప్రభుత్వం...
### ప్రజా ప్రభుత్వం...
### ప్రజా సంక్షేమం,
### అభివృద్ధే లక్ష్యంగా అడుగులు...





**కలిదిండి, మేజర్‌న్యూస్ :** ఇది మంచి ప్రభుత్వం ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం రెండు సమాంతరంగా అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శనివారం కలిదిండి మండలం భాస్కరరావుపేటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వంఅనే బృహత్తర కార్యక్రమంలో స్థానికఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్‌తో కలిసిజిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈకార్యక్ర మానికిపలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ దేశంలోఎక్కడాకూడా ఇంతపెద్దమొత్తంగాఎన్.టి.ఆర్. భరోసాసామాజికి పెన్షన్లు పలు కేటగిరీల కింద పేదలకు ప్రతినెలా 1వతేదీ తెల్లవారుజామునుంచే సచివాలయాల సిబ్బంది ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రే స్వయంగా ఉదయం 6 గంటలకే పెన్షన్ దారులకు పెన్షన్ పంపిణీ చేస్తూ అందరికీ ఆదర్శ ంగా నిలుస్తూ అధికారులకు, సిబ్బందికి ఎంతో స్ఫూర్తిని అందిస్తున్నా రన్నారు. అంతే కాకుండా విపత్తుల సమయంలో ముఖ్యంగా గోదావరి వరద, కొల్లేరు వరద సమయాల్లో కూడా ప్రతిరోజు కలెక్టర్లకు స్వయ ంగా ఫోన్ చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ అవసరమైన దిశా, నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఈ రోజుకూడా ముఖ్యమంత్రి టెలీఫోన్ ద్వారా ఉప్పుటేరు, కొల్లేరు ముంపుసమస్యలపై ఆరాతీసిసం బంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ సహాయం చేసేందుకు వినూత్న మార్గాలు అన్వేషించే ముఖ్యమంత్రి వర్యులను మనంఅందరంస్ఫూర్తిగా తీసుకోవా లని స్పష్టం చేశారు. ఇలాంటి మంచి అనుభవం దూరదృష్టి వున్న ప్రభుత్వంలో పని చెయ్యటం చాలా సంతోషంగా వుందన్నారు. ప్రతి ఆలోచన అభివృద్ధి వైపే కొనసాగుతున్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వం అందిస్తున్న మంచి పాలనతో ఏలూరు జిల్లాని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కైకలూరు శాసన సభ్యులు డా. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులకు 100 రోజులలో చేసిన 100 మంచి పనులను వివరించారు.

గత ప్రభుత్వం అన్ని శాఖలను నిర్వీర్యం చేసింది అభివృ ద్ధిలేక గ్రామపంచాయితీలు విలవిలలా డాయ న్నారు. ప్రస్తుతం ఎన్ డిఎ ప్రభుత్వం 100 రోజులలో ప్రతి హామీ నెరవేర్చే విధంగా అడుగులు వేస్తుందన్నారు. కైకలూరు నియోజకవ ర్గంలో వరద బాధితులకు 24 గంటల్లో 50 టన్నుల బియ్యాన్ని అందించి పనిచేసే ప్రభుత్వంగా ప్రజల్లో గుర్తింపు పొందిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్సీ విడుదల చేయడం, ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు, ఎన్ టిఆర్ భరోసా సామాజిక భద్రత పెంపు, అన్న క్యాంటిన్ల పునరుద్ధరణతోపాటు గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు బాకాయిలు చెల్లించి అన్నదాతను ఆదుకోవడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు. ఆర్డిఓ ఎన్ఎస్ కె ఖాజావలి, స్థానిక ప్రజా ప్రతినిధులు, పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తీరం పరిశుభ్రతకు అందరూ సహకరించాలి






### జిల్లా కలెక్టర్,జేసీ,ఎమ్మెల్యే

**మొగల్తూరు, మేజర్ న్యూస్ :** సాగర తీరం పరిశుభ్రతకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్సిస్ సంస్థ ఆధ్వర్యంలో మొగల్తూరు మండలం మోళ్ల పర్రు బీచ్ లో శనివారం ఏర్పాటుచేసిన స్వచ్ఛ సాగర్ .. సురక్షిత సాగర్ కార్యక్రమంలో శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,పరిశుభ్రత అనేది మన సంస్కారంలో స్వభావంలో ఇమిడిపోవాలన్నారు.

పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా తీర ప్రాంతంలో 20 బొట్లుతో గస్తీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. శాశ్వతంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, సిమెంటు కట్టడాలతో కూడిన డస్ట్ బిన్ లను తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పేరుపాలెం బీచ్ లో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటువలనప్రమాదాలను అరికట్టేందుకు దోహదపడుతుందని, మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు జిల్లాకలెక్టర్‌కు విన్నవించడం జరిగింది.బీచ్‌లో ఒక కిలోమీటర్ పరిధిలో వున్న చెత్తను, గాజు సీసాలను, వ్యర్థ పదార్థాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, పాఠశాల విద్యార్థులు, మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు, ఇన్సిస్ సంస్థ సభ్యులు, తదితరులు స్వయంగా ఏరి, చెత్త సంచులలో వేశారు.తొలుత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దశావతార సహిత మహా మత్స్య నారాయణ స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం, వేద పండితుల ఆశీర్వచనాలను తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు, తెలుగుదేశం ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జాయింట్ కలెక్టర్ నరసాపురం ఆర్డిఓ ఎం.అచ్యుత్ అంబరీష్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్ వి ఎస్ ప్రసాద్, సెట్ వెల్ సీఈవో కేఎస్ ప్రభాకర్ రావు, నరసాపురం డివిజన్ డిఎస్పి ఎన్.బి.ఎం మురళీకృష్ణ, మొగల్తూరు తహసిల్దార్ సిహెచ్ విద్యాపతి, సర్పంచ్ అందే వెంకటలక్ష్మి, ఎంపీటీసీ అందే ముక్తేశ్వరరావు, ఎరుపాలెం సౌత్ సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ బి.శ్రీ వెంకటరమణ, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మైలా శ్రీనివాస అర్జున కుమార్, బి.సీతారామరాజు, గున్న బత్తుల ట్రస్ట్ ఫౌండర్ నందిని ప్రసాద్, ఇన్సిస్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది, నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంచే వంద రోజుల్లో

# అనేక సంక్షేమ పథకాలు


### జిల్లా కలెక్టర్ నాగరాణి,ఎమ్మెల్యే నాయకర్



**మొగల్తూరు,మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించడం "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.శనివారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ అధికారులతో కలిసిపాల్గొని, కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్లు 3 వేల రూపాయల నుండి4 వేల రూపాయలకు పెంపు చేయడంతో పాటు, 2024 ఏప్రిల్ నుంచి పెంచిన పింఛను జూలై నెలలో 7వేల రూపాయలు లబ్ధిదారులకు అందించిన విషయం కలెక్టర్ వివరించారు. అదేవిధంగా అంగవైకల్యం కలవారికి, బెడ్ రిడెన్ వారికి 15 వేల రూపాయల వరకు పింఛను పెంపు చేయడం జరిగిందని వివరించారు. ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించి బడుగు బలహీన శ్రామిక వర్గాలకు 5 రూపాయలకే అల్పాహారం,5రూపాయలకే భోజనం అందిస్తోందన్నారు.ఇటీవల విజయవాడను ముంచెత్తిన వరదలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొనిసాధారణస్థితికి తీసుకురావడం ఒక గొప్ప విషయం అన్నారు.అందరి సహకారంతో నియెజకవర్గ అభివృద్ధికి నిరంతరంకృషిచేస్తాఅన్నారు.

ఈ సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, సర్పంచి అడ్డాల సూరిబాబు, ఎంపీటీసీ తిరుమాని స్వామి, జడ్పిటిసి గుబ్బల నాగరాజు, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, కే మునిస్వామి, మాజీ ఎంపీటీసీ కే బాలకృష్ణ, పంచాయతీ సెక్రటరీ,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి సూర్య హైస్కూల్లో ఉత్సాహంగా విద్యార్థి సంఘం ఎన్నికలు



**టి.నరసాపురం,మేజర్‌న్యూస్:** విద్యార్థుల్లో నాయకత్వంతో పాటు సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడానికి విద్యార్థి సంఘం ఎన్నికలు దోహదపడతాయని మండల విద్యాశాఖాధికారి.టి రామ్మూర్తి తెలిపారు. స్థానిక శ్రీసాయిసూర్య పాఠశాల్లో కరస్పాం డెంట్ కంచర్ల పవన్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థుల ప్రతినిధి (ఎస్ పిఎల్) ఎన్నికలు నిర్వహించారు.ఈ ఎన్నికల్లో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని పారదర్శకంగా ఓటుహక్కు వినియోచుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఓ రామ్మూర్తి ఎన్నికలు జరిగే తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా విజయం సాధించిన కాలీనేడి దివ్యశ్రీ విద్యార్థిని అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంగ్లో ఇండియన్ స్కూల్ విద్యార్థుల వరద సాయం రూ.2 లక్షల 50 వేలు



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ : స్థానిక సుబ్బారావు పేటలో గల ఆంగ్లో ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు విజయవాడ గుంటూరు వరద బాధితుల సహాయార్థం 2లక్షల 50 వేల రూపాయల విరాళం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్‌కి అందించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులలో ఇటువంటి సేవాగుణం అభినందనీయమని, చిన్నతనం నుండి ఇటువంటి కార్యక్రమాలు చేయడం ద్వారా పిల్లలలో సేవా భావం మరియు సామాజిక బాధ్యత పెరుగుతుందని తెలిపారు. ఆంగ్లో ఇండియన్ స్కూల్ చైర్మన్ కొడాలి రమేష్ బాబు డిడి ను శాసనసభ్యులు శ్రీనివాస్‌కి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు నాయకులు పాల్గొన్నారు.

# బలుసులమ్మ అమ్మవారి దీవెనలు అందరికీ ఉండాలి



ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్: గ్రామ దేవత బలుసులమ్మ తల్లి అమ్మవారిని శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బలుసులమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులతో దసరా ఉత్సవాల కరపత్రాలని ఆవిష్కరించారు. శాసనసభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేసి వచ్చే ఏడాది అమ్మవారి జాతర నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలూరు వెంకటేశ్వరరావు, అంజి సురేషు పలువురు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

**28న అన్ని గ్రామ పంచాయతీలలో,**

**మున్సిపాలిటీలలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు**

**భీమవరం, మేజర్ న్యూస్ :** గృహాలన్నిటినీ లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని, పూర్తిచేయడానికి మన ఇల్లు – మన గౌరవం పేరుతో ప్రత్యేక గృహ నిర్మాణ అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మన ఇల్లు – మన గౌరవం అవగాహన కార్యక్రమంపై హౌసింగ్ ఇంజనీర్లు, ఎం.పి.డి.ఓ లు, మండల స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్స్, ఈ.ఓ.పి.ఆర్.డి లు తదితరులతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 28 న అన్ని గ్రామ పంచాయతీలలో, మున్సిపాలిటీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో రూఫ్ లెవెల్ వరకు వచ్చిన 3,242 వేల గృహాలను అక్టోబర్ 24 నాటికి, అలాగే బేస్మెంట్ లెవెల్ లో వున్న 5,512 గృహాలను 2025 మార్చి 25 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. మార్చి 25 తరువాత పీఎంఏవై 1.0 హౌసింగ్‌కు నిధులు మంజూరు కావని, అనంతరం పీఎంఏవై 2.0హౌసింగ్‌ప్రోగ్రామ్ ప్రారంభమవుతుంద న్నారు. గృహ నిర్మాణా పనులలో ఉపాధి హామీ పథకం క్రింద 90 రోజులు పని దినాలు కల్పనలో 50 రోజులు బేస్ మెంట్ లెవెల్ కు, 40 రోజులు రూఫ్ లెవెల్ కు కేటాయించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో, మున్సిపాలిటీలలో లబ్ధి దారులను వారికి మంజూరు చేసిన గృహాల వద్దకు సెప్టెంబర్ 28న తీసుకు వెళ్లి చూపించి, నిర్మించుకోడానికి అవగాహన కలిగించాలని తెలిపారు. హౌసింగ్ పరిధిలో పేదలకు ఇల్లు



కట్టించడంపై అధికారులు నూరు శాతం ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి స్టేజీలో వార్డ్ అమినిటీ సెక్రటరీ లబ్ధిదారులకు అవగాహన కల్పించడం చేయాలన్నారు. పీఎంఏవై అర్బన్, పీఎంఏవై గ్రామీణ్ లో భాగంగా మొదలుకాని ఇళ్ల నిర్మాణాలను వెంటనే మొదలు పెట్టాలని, సంబంధిత నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారి మండల ప్రత్యేక అధికారులు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలని, నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈ కార్యక్రమం అమలులో ఎలాంటి సందేహాలున్నా హౌసింగ్ పి.డి. ని సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి బి.పిచ్చయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును అరెస్టు చేయాలి

మాలల ఐక్యవేదిక డిమాండ్



**నరసాపురం, మేజర్‌న్యూస్ :** కాళ్ళ మండలం ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీనితొలగించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజుపై వెంటనే ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరస్ట్ చేయాలని, ఎమ్మెల్యే బహిరంగ క్షమపాణ చెప్పి అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేఖం చేయాలనీ టీడీపీ నుండి సస్పెండ్ చేయాలనీ నరసాపురం నియజకవర్గ మాలల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. శనివారం ఐక్యవేదిక అధ్యర్యంలో నరసాపురం అంబేద్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించి ఎమ్మెల్యే చిత్రపటాన్ని చెప్పులతో కోట్టి నిప్పుతో కాల్చరు. ఈకార్యక్రవ ంలో దళిత నాయకులు ఇంజెటి జాన్ కెనడి, కాకిలేటి ఆనంద్ కుమార్,అడిదేల శరత్, సోడ దాసి శ్రీధర్, పడవల సత్యనారాయణ,కొల్లా బత్తుల రవి, వర్ధనపు సుధాకర్, కాటం చంటి, పిల్లి నవరత్నం, గోరింకల వినోద్, దాసరి రాజు, తోట నాగేశ్వరావు, తోట చిట్టిబాబు,వర్ధనపు యేసురత్నం, ఏలూరి కుమార్ రత్నం, తాడిలక్ష్మణ్ రావు,గాది రవి,కాటిక. కుమార్,నేతల రమేష్,చిలక పాటి జోసెఫ్,గమిడి రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో ఎలుకల నిర్మూలన చేస్తే తగ్గనున్న పంట నష్టం



**భీమడోలు, మేజర్‌న్యూస్:** సకాలంలో ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపడితే పంట నష్టం తగ్గి, దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు హబీబ్ భాష తెలిపారు. భీమడోలు మండలంలో వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు ఉషా రాజకుమారి, వ్యవసాయ అధికారి ఉషారాణి, సాంకేతిక వ్యవసాయ అధికారి పిఎన్ ప్రసూన ఆధ్వర్యంలో ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సూరప్పగూడెం గ్రామం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఎలుకల నిర్మూలన మందును పంపిణీ చేశారు. దానిని వాడే విధానం గురించి తెలిపారు. కార్యక్రమాన్ని పరిశీలించేందుకు. అమరావతి కమిషనర్ కార్యాలయం నుండి జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన సంయుక్త సంచాలకులు పద్మజ వచ్చారు.వారికి సహాయకులుగా ఏలూరు డాట్ సెంటర్ కు చెందిన సహాయ సంచాలకులు లలిత సుధ, శాస్త్రవేత్త ఫణి కుమార్ వ్యవహరించారు. వీరితో పాటు పర్యటనలో వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు పాల్గొన్నారు. రైతులతో మాట్లాడారు. ఈనెల 25వ తేదీతో పంట నమోదు కార్యక్రమం పూర్తి కావలసిన నేపథ్యంలో రైతులు తమ వివరాలను ఇ.కె.వైసి ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

## జడ్పీ హైస్కూల్లో విజిలెన్స్ జిల్లా కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి తనిఖీ





**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** మండలంలోని తిరుమలంపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనపథకంఅమలు తీరును జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ పరిశీలించారు. శనివారం ఉదయం ఉన్నత పాఠశాలకు చేరుకుని తొలుత మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్య తదితర వివరాలు ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటశాలను చేరుకుని అక్కడి వసతులను, వంటకాలను పరిశీలించారు. సిబ్బంది అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సదుపాయాలను పరిశీలించారు. భోజన వితరణ జరిగే వరకు అక్కడే ఉండి విధానాన్ని గమనించారు.

విద్యార్థులతో విడివిడిగా ముచ్చటించి పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, నీటి లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందిస్తే వారు ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంటారని, చదువులో రాణిస్తారనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని, అమలులో ఎటువంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు విజయకృష్ణ సూచించారు. పాఠశాలలో నీటి శుద్ధి యంత్ర సామగ్రి అన్నీ ఉన్నప్పటికీ వినియోగంలో లేకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేయాలని సిబ్బందిని కోరారు. అన్ని వివరాలతో నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేస్తానని విజయకృష్ణ తెలిపారు.

## అన్న క్యాంటీన్ ప్రారంభం కాకుండా వైసీపీ నాయకులు కుట్ర


జనసేన కౌన్సిలర్లు ఆరోపణ



**నర్సాపురం, మేజర్‌న్యూస్ :** పేదలకు అన్నం పెట్టేందుకు వైసీపీ నేతలకు ఇష్టం లేదని, అందువల్లే అన్న క్యాంటీన్ ప్రారంభం కాకుండా కుట్ర చేశారని, అయినప్పటి కీక్యాంటీన్ ప్రారంభి పేదలకు ఐదు రూపాయలకే కూటమి ప్రభుత్వం భోజనం పెడుతుందని జనసేన కౌన్సిలర్లుఅన్నారు. శనివారం స్థానిక జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే నాయకర్ పై మున్సిపల్ చైర్ పర్సన్ బర్రెశ్రీ వెంకట రమణ, మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు. నాయకులు చేసిన ఆరోపణలను కూటమి కౌన్సిలర్లు ఖండించారు. జనసేనపార్టీ పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరావు, టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, జనసేన కౌన్సిలర్లు కొప్పాడి కృష్ణవేణి, బొమ్మిడి సూర్యకుమారి, తోట అరుణ ,భారతి సురేష్ విలేకర్లతో మాట్లాడారు. ప్రొటోకాల్ గురించి మాట్లడే అర్హత చైర్ పర్సన్‌కు లేదన్నారు.

వైసీపీ ప్రభుత్వహాయంలో ప్రతిపక్ష కౌన్సిలర్ లకు చైర్ పర్సన్‌గా మిరిచ్చిన గౌరవం ఏమిటంటూ నిలదీశారు. వైసీపీకి చెందిన 15 నుంచి 20 మంది కౌన్సిలర్లు మా ఎమ్మెల్యేతో టచ్లో ఉన్నారన్నారు. అయితే తీసుకోవాలా వద్దా అన్నది మా ఎమ్మెల్యే నిర్ణయం తీసుకుంటారన్నారు. మునిసిపాల్టీలో పెద్ద ఎత్తున్న అవినీతి జరిగిందని, త్వరలో వీటిని సాక్ష్యదారాలతో బయట పెడతామన్నారు. కూటమి పార్టీలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకోమన్నారు. ఈసమావేశంలో వలవల నాని, అకన చంద్రశేఖర్ ఇతరులు పాల్గొన్నారు.

# సంక్షేమం - అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం





**ఎమ్మెల్యే బాలరాజు, టిడిపి ఇన్ ఛార్జ్ బొరగం**

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:**సంక్షేమ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందని ఎమ్మెల్యే చిర్రిబాలరాజు, తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాసులు అన్నారు, 100 రోజు పాలనలో భాగంగామంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో శనివారం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల ప్రభుత్వం మంచి పాలన కొనసాగిస్తుందని తెలియజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వంద రోజుల్లోనే అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని వచ్చే ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కింది అన్నారు. 100రోజుల పాలన లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నామని తెలియజేశారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, నాయకులు గడ్డం రవి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుభీమేశ్వరరావు, గన్నిన సూర్యచంద్రరావు,దారాశి కామణిజనసేనపార్టీ నాయకులు గంగా భవాని, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ మురళీకృష్ణ, పంచాయతీరాజ్ రామాంజనేయులు, ఎస్సై దుర్గా మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఏఎస్‌పి మురళి కృష్ణ



**నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** మండలంలోని సీతారామపురం గ్రామములో గల స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యములో ర్యాగింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిదులుగా అడిషినల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఎన్.బి.ఏం. మురళీ కృష్ణ,సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్,జి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాడు పడి తమ ఉజ్వల భవిష్యత్తు నాశనము చేసుకోవద్దని, ప్రతి విద్యార్థి నిత్యము ఏదో ఒక పనిని చేస్తూ ఉంటే చెడు ఆలోచనలు మెదడులోనికి రాకుండా వుంటాయని 4 సం.రముల ప్రతీ విద్యార్థి నిరంతరగా కష్టపడి చదివితే రానున్న కాలములో సుఖమైన జీవితం, ఆనందమైన జీవితం పొందుతారని అన్నారు. 21వ సం.రం నుండే ప్రతి విద్యార్థి ఐఏఎస్, ఐపీఎస్, గేట్ లాంటి పోటీ పరీక్షలకు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకుని 21 సం.రములకే ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం గురించి విద్యార్థులకు సమాచారం తెలిస్తే ధైర్యంగా పోలీసు వారికి తెలియజేసి సహకరించవలసినదిగా కోరారు. ప్రస్తుత రోజులలో ఎన్.ఎస్.ఎస్., ఎన్.సి.సి., స్పోర్ట్స్ రంగాలలో విద్యార్థులు తమ యొక్క సేవలు అందిస్తే, వాటి వలన పూర్తి ఉపయోగం సర్టిఫికేట్ పొందితే ఆ సర్టిఫికేట్ వలన ఎంతో ప్రయోజనం ఉందని అన్నారు. ఈ సదస్సులో కళాశాల ఛైర్మన్ కె.వి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వరస్వామి,డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల ప్రిన్సిపల్ డా.ఏ.గోపి చంద్ ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ విస్సా మాణిక్యాలరావు, ఏం.వి.కృష్ణమోహన్, ఎన్.ఎస్.ఎస్. కో–ఆర్డినేటర్ మెకానికల్ డిపార్ట్ మెంట్‌కు చెందిన టి.ఎల్.ఎన్.దుర్గా హనుమాన్, రోబోటిక్స్ డిపార్ట్ మెంట్‌కు చెందిన డి.జోషి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం


**ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి**

**పెంటపాడు, మేజర్‌న్యూస్:** అఖండ మెజారిటీతో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడులో శనివారం నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లపాటు జగన్ సర్కార్ రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసిందని, ప్రజలు నివసిస్తున్న కనీసం జగనన్న కాలనీలో రోడ్డు వేయలేని పరిస్థితిలో వైసీపీ సర్కార్ పాలన చేసిందన్నారు. ప్రత్తిపాడు గ్రామం లో ఉన్న ప్రజలకు 2014 లో అప్పటి ప్రభుత్వము ఇచ్చిన స్థలాలకు జగనన్న కాలనీగా పేరు పెట్టుకొవ్వడం విడ్డూరం గా ఉందన్నారు. ఇప్పటి నుంచి ఈ కాలనీని చంద్రన్న కాలనీలో పేరు పెడుతున్నట్టు అక్కడ కాలనీ వాసులకు తెలియజేశారు. ఈ కాలనీకి దాతలు, ప్రభుత్వ సహాయంతో సుమారు ఒక కోటి రూపాయల పైననే అభివృద్ధి పనులు చేపట్టామని ఆ పనిలో భాగంగా ఫిల్టరైజేషన్ వాటర్ ట్యాంక్ శంకుస్థాపన కాలనీ వాసులతో చేశారు. ప్రజలు కొద్ది రోజులు ఓపిక పడితే గత ప్రభుత్వం చేయలేని రోడ్లు డ్రైనేజ్ లు వేసే బాధ్యత తామే తీసుకుంటామన్నారు. వరద బాధితులకు కోటి రూపాయల విరాళం ప్రకటించిన జగన్ ఇప్పటికీ పది పైసలు కూడా ఇవ్వలేదని అద్దేవా చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ జగనన్న కాలనీలను సుందరంగా తీర్చిదిద్ది ఆ కాలనీ ఇళ్లకు చంద్రన్న కాలనీలుగా నామకరణం చేస్తామన్నారు. 900



పైచిలుకు మెజారిటీ కూటమి ప్రభుత్వానికి అందించిన ప్రత్తిపాడు ప్రజల సమస్యలన్నీ తీర్చే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాలు నడుస్తున్నాయని ప్రజలకు సంపూర్ణ న్యాయం చేస్తామని అన్నారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని నిధులు తీసుకురావడంలో తాము కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ ద్వారా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పీ శ్రీనివాస్, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, జనసేన గ్రామ అధ్యక్షుడు చెరుకూరి జగత్ సోమశేఖర్, ప్రభుత్వ అధికారులు, ఉమ్మడి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టణంలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీ




**నరసాపురం,మేజర్‌న్యూస్ :**రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం వారి ఆదేశముల ప్రకారం "స్వచ్ఛత హి సేమ2024" పక్షం రోజుల (15 రోజులు) కార్యక్రమములో భాగముగా శనివారంమునిసిపల్ కమీషనర్ యం అంజయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగాపబ్లిక్ హెల్త్ వర్కర్ లకి పి పి ఈ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో, మెప్మా, మునిసిపల్ ఆఫీసు, సచివాలయం సిబ్బంది, వార్డు కౌన్సిలర్‌లు, కొఆప్షన్ మెంబర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**– ఎమ్మెల్యే చింతమనేని**



**పెదవేగి,మేజర్‌న్యూస్:** అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సాగించిన 100 రోజుల పాలనను " ఇదిమంచి ప్రభుత్వం"పేరుతో నిర్వహిస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగిమండలం రాట్నాలకుంట గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గత వైసిపి పాలనలో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆశగా ఎదురు చూశారని, ఒక్క టీచర్ పోస్టును కూడా గత వైసిపి ప్రభుత్వం భర్తీ చేయలేదని, నిరుద్యోగులకు వయస్సు పెరిగింది తప్ప డీఎస్సీ ద్వారా ఒక్క ఉద్యోగం కూడా రాలేదని ఆయన అన్నారు.. 100రోజుల పాలన లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను "ఇది మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు .కూటమీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి అధికారి నిబద్ధతతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇటు ప్రజాప్రతినిధులతో పాటు అటు అధికారులు కార్యకర్తలు కలిసి సమన్వయంతో పని చేస్తున్నారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ ఘంటసాల వెంకట లక్ష్మి, పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు బొప్పన సుధకర్, కూటమి నాయకులు కోటారు ఆదిశేషు, నంబూరి నాగరాజు, నేతల రవి, సైధు సత్యనారాయణ, మంచినేని శ్రీనివాస్, కొనకళ్ళ శివమణి,మేకాకనకరాజు,జమలయ్య, తాతసత్య నారాయణ,ఎంపిడిఓ, డిప్యూటీ తహశీల్దార్ సహాపలువురు అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపేటలో ఘనంగా గణేశుని నిమజ్జనాలు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు స్థానిక కొత్తపేట 43 వ డివిజన్, సబ్బవరపు వారి వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రుల మహోత్సవాలు కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం వినాయక చవితి ముగింపు సందర్భంగా ట్రాక్టర్ వాహనానికి పుష్పాలతో,మామిడి తోరణం,స్వామి వారిజెండాలతోఅలంకరించి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని,పిండి వంటలతో నైవేద్యం సమర్పించా రు. అనంతరం నగర పురవీధుల లో మేళ తాళాలతో మంగళ వాయిద్యాలు నడుమ భక్తులకు ప్రసాదాలను వితరణ చేస్తూ స్వామివారిని నిమజ్జనం చేశారు.

# కొనసాగుతున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు





భీమడోలు,మేజర్‌న్యూస్: మండలంలో కొనసాగుతున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు శనివారంతో ఆరవ రోజుకి చేరాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా సూరప్పగూడెం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధిగారి పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు పారిశుధ్యం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. పురవీధులలో ర్యాలీ చేపట్టారు. పారిశుద్ధ్య పనులపై డ్రైవ్‌ను నిర్వహించారు.ఆతర్వాత గ్రామపంచాయతీ సౌజన్యంతో పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కిట్లను అందజేశారు. పనుల సందర్భంగా రక్షణ కోసం అవసరమైన పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి సుందరి పాల్గొన్నారు.

# ఘనంగా గురజాడ జయంతి వేడుకలు



పాలకొల్లు,మేజర్‌న్యూస్: స్థానిక జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నందు గురజాడ వారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీప్రసాద్ రాయపూడి పిల్లలు ఉద్దేశించి మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్..దేశమంటే మనుషులోయ్ అన్నగురజాడ అందరికీఆదర్శం అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసే ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు చాక్లెట్లు,బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, భవాని దుర్గ, పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యం

### డాక్టర్ డి.మహేశ్వరరావు

**పాలకొల్లు, మేజర్‌న్యూస్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శివదేవుని చిక్కాల సచివాలయం వద్ద స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం గ్రామ సర్పంచ్ దిడ్ల మణివజ్రం అధ్యక్షతన సభా కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. మహేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మన మనసు స్వచ్ఛతగా ఉంటే మనం చేసే పనులు కూడా స్వచ్ఛతగా ఉంటాయని. అలాగే ప్రతి ఒక్కరు స్వచ్ఛతగా ఉండాలని అన్నారు. తద్వారా గాలి స్వచ్ఛంగా ఉండాలి. నీరు స్వచ్ఛంగా ఉండాలి. మనం తీసుకునే ఆహారం స్వచ్ఛంగా ఉండాలి అప్పుడే ఆరోగ్యకరంగా ఉంటామని తెలిపారు. ఇవన్నీ బాగుండాలి అంటే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అప్పుడే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతామన్నారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి .వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోనూ స్వచ్ఛత కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం వలన అనేక వ్యాధుల్ని నిర్మూలించుకోగలిగామని. ఇంకా దోమల ద్వారా వచ్చే వ్యాధులు. ఈగల ద్వారా వచ్చే వ్యాధులు. కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులను నిర్మూలించుకొనుటకు ప్రతి వ్యక్తి చెత్తాచెదారమును డ్రైనేజీలు. కాలువలు. చెరువులలో వేయకుండా శ్రద్ధ వహించాలని. అలాగే కలుషితమైన నీటిని త్రాగకుండా కాచి చల్లార్చి నీటిని మాత్రమే



త్రాగాలని తెలిపారు. అనంతరం మొక్కలు నాటి. హై స్కూల్ విద్యార్థులు మరియు గ్రామ పెద్దలు. సచివాలయం సిబ్బంది. వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు గుడాల హరిబాబు. కే బి కే రమేష్ రెడ్డి. హై స్కూల్ హెడ్ మాస్టర్ పొట్ల రాము. డ్రిల్ మాస్టర్ గంగా మహేష్. ఎంపీటీసీ మేడిది శ్రీను. గ్రామ పెద్దలు కోటిపల్లి సత్యనారాయణ స్వామి. సాధనాల ఉదయభాస్కర్. గన్నాబత్తుల శివ గణేష్. జుత్తిక వెంకటచలం. పంపన శివ. మోపిదేవి శివశంకర్. గన్నాబత్తుల శ్రీనివాస్. ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం సుశీల. ఎం ఎల్ హెచ్ పి సుజిత. టీ హరిబాబు. తారకసత్య. కె.వి.ప్రసాద్. గోపాలకృష్ణ. సచివాలయ సిబ్బంది ఆశా కార్యకర్తలు. డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార మాసోత్సవాల్లో గర్భిణీ స్త్రీలకు సీమంతాలు



**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శనివారం 17,14,19 వార్డులలో చీర సారె అందించి సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం మాజీ మున్సిపల్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో వారి సొంత ఖర్చులతో గర్భిణీ స్త్రీలకు చీర సారేలతో సాంప్రదాయ పద్ధతిలో సీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్త్రీలకు, అధికారులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, అంగన్వాడి టీచర్ల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, టిడిపి జనసేన ఇన్చార్జిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నందు శిక్షణ, సందర్శన




పెనుమంట్ర, మేజర్‌న్యూస్ : మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లో శిక్షణ, సందర్శన శనివారం నిర్వహించారు, సహ పరిశోధనా సంచాలకులుడా.టి.శ్రీనివాస్ అధ్యక్షత జరిగింది, డా.టి.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సాగుచేస్తున్న వరి పంట రెండు సార్లు ముంపుకు గురైందని, ఇటువంటి పరిస్థితులలో శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు ముంపు ప్రాంతాలను సందర్శించి, నష్ట నివారణ చర్యలను గురించి ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించామని తెలిపారు. సోమవారం నుండి శాస్త్రవేత్తల బృందాలు బాక్టీరియా ఎండాకు తెగులు ఆశించిన ప్రాంతాలలో పర్యటించి నష్టనివారణా చర్యల గురించి తెలియజేస్తారని తెలిపారు. మన పరిశోధనా స్థానం నుండి ఎం.టి.యు 1426 అనే నూతన రకాన్ని రూపొందించామని, ఈ రకం 120 రోజుల పంటకాలం కలిగి కేవలం 13.6 గ్రాముల వేయి గింజల బరువు కలిగి ఉండటం వల్ల తినడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ముఖ్యఅతిథి జిల్లా వ్యవసాయ అధికారి జడ్. వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఈ నెల 24 నుండి పొలం పిలుస్తోంది కార్యక్రమం మొదలవబోతున్నదని, కావున శాస్త్రవేత్తలంతా తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పధాన శాస్త్రవేత్త (వరి) డా.ఎం.గిరిజారాణి మాట్లాడుతూ వివధ పురుగు మందులు, తెగులు మందుల కలయిక, చిరు సంచుల రకాల సమాచారం తెలిపారు. డా.ఎం.వి.కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ విభాగం) పాల్గొన్నారు.

# ప్రజా అంకితభావంతో నిర్ణయాలు తీసుకుంటున్న కూటమి



కైకలూరు,మేజర్‌న్యూస్, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ సారధ్యంలో " ఇది మంచి ప్రభుత్వం "కార్యక్రమంలో ప్రజా ప్రభుత్వం ద్వారా ప్రజలకు మంచి జరిగిన ప్రభుత్వ పనితీరు ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వీరభత్తిన సుధా మాట్లాడుతూ కేంద్రంలో మన రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ అంకితభావంతో నిర్ణయాలుతీసుకుంటున్నారుఅనిఅన్నారు. సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయ డమే కాకుండా అభివృద్ధికి సంబంధించి రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అన్ని నిర్ణయాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ కన్వీనర్ డోకల శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు బెల్లాని శ్యామల రావు, బంకపల్లి భాస్కరరావు, గఫూర్, ఖాన్, రసూల్,ఖాన్,పళ్లెం చైతన్య, గ్రామ రెవెన్యూ అధికారి టి.వి.ఆర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సహకరించాలి



**భీమడోలు,మేజర్‌న్యూస్:** గ్రంధాలయ సంస్థకు వివిధ శాఖల నుంచి రావలసిన బకాయి సెస్‌ల ను త్వరితగతిన చెల్లించి సంస్థఅభివృద్ధికి సహకరించాలని జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు కోరారు. శనివారం భీమడోలు శాఖా గ్రంధాలయాన్ని సందర్శించిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వార్షిక తనిఖీను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథ పాలకులు కె. శ్రీనివాసరావు పలు అంశాలను ఆయన దృష్టికి తెచ్చారు. గ్రంధాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులు ఉమామహేశ్వ రరావు, సుధాకర్ గ్రంధాలయ అభివృద్ధికి కావలసిన వివిధ అంశాలను జిల్లా కార్యదర్శి దృష్టికి తెచ్చారు.అనంతరం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ జిల్లా గ్రంధాలయ సంస్థకు ఏలూరు కార్పొరేషన్ నుంచి రూ. 9 కోట్లు,గ్రామ పంచాయతీ నుంచి రూ.9 కోట్లు,ఇతర మున్సిపాలిటీ నుంచి రూ.2 కోట్ల రూపాయల బకాయి సెస్‌లు వసూలు కావలసి ఉందన్నారు.ఈ బకాయిలను జమ చేస్తే వాటితో గ్రంథాలయ భవన నిర్మాణాలు, మరమ్మతులు.,మౌలిక సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలను చేపట్టగలమని తెలిపారు.

# న్యాయమూర్తులకు వివిధ చట్టాలపైవర్క్ షాప్



**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అధ్యక్షతన శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు ఏలూరు కోర్టు ప్రాంగణము నందు వివిధ చట్టాల పైన వర్క్ షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ మాటాడుతూ ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాల పైన మరింత నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఇటువంటి వర్క్ షాపులు నిర్వహిస్తున్నారని, ఈ వర్క్ షాప్ నందు 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్, చట్టం- పరిధి, తీర్పులను అమలుపరచడం, బాలల పైన లైంగిక దాడుల (పోక్సో యాక్ట్) విచారణ, బాధితుల పరిహారం అనే అంశములపైన ఈకార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రవంలో ఆంధ్ర రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి శ్యాంసుందర్, రిటైర్డ్ జిల్లా జడ్జి జి.వి.కృష్ణయ్య, ఆంధ్ర రాష్ట్ర హైకోర్టు న్యాయవాది జంపన శ్రీదేవి రిసోర్స్ పర్సన్ గా పాల్గొంటున్నారని తెలియజేశారు.ఆంధ్ర రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ మాట్లాడుతూ చట్టాల్లో వస్తున్న మార్పులను అధ్యయనం చేయటానికి వర్క్ షాపులు ఎంతో ఉపయోగ పడతాయని, న్యాయమూర్తులు ఉత్తమమైన సేవలు అందించడానికి ఎంతో దోహదపడతాయని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అదనపు జిల్లా జడ్జీలు, సీనియర్ సివిల్ జడ్జిలు జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

# గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం

# అప్పుల రాజ్యానికి జగన్ రెడ్డి మహారాజు

**- మాజీ మంత్రి , ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ**



**పెనుమంట్ర,మేజర్‌న్యూస్ :** ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం సంక్షేమం అప్పుల రాజ్యం కొనసాగిందని ఆరాజ్యానికి అప్పుల మహారాజు జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం నత్తా రామేశ్వరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నరు, మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జగన్మోహన్ రెడ్డి పై ఘాటైన విమర్శలు చేశారు, పెన్షన్ల తప్ప ఉద్యోగులకి ఒకటో తారీఖున జీతాలు ఇవ్వలేదని అన్నారు, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 100 రోజుల్లో డీఎస్సీ ద్వారా 16437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారని అన్నారు, వృద్ధులకు వికలాంగులకు పెన్షన్ల పెంపు, బుడమేరు ముంపు వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో చంద్రబాబు నిద్రాహారాలు మాని సేవలందించారని చెప్పారు. అప్పు చేయకుండానే సూపర్ సిక్స్ పథకాల అమలు చేసేలా ప్రయత్నిస్తా మన్నారు.అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు ప్రకటించారు100 రోజుల పూర్తయిన సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాన్ని చేయాలన్నదే ఇది మంచి ప్రభుత్వం లక్ష్య మనీ పునరుద్ఘాటించారు. తాగునీటి సమస్యలు రహదారుల నిర్మాణం వాటర్ ట్యాంక్ నిర్మాణం చెరువుల ఆధునికరణ చేపడతామని అన్నారు,

సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, ఎంపీటీసీ టీఎం రెడ్డి, మండల తాసిల్దార్ వై రవికుమార్, ఎంపీడీవో పిపద్మజ, మండలపార్టీ అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ కర్రి సుబ్బారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు కమలంపూడి శ్రీరామ దుర్గారెడ్డి, జనసేన అధ్యక్షులు ఆకివీడు శ్రీహరి, టిడిపి అధ్యక్షులు చిటికెన సాంబ, తాతారెడ్డి, సత్తి సత్యానంద రెడ్డి పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలి

బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్ : ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుట్టాయిగూడెం సి ఐ టి యు ఆఫీస్ వద్ద ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు ) మండల కమిటీ సమావేశం శనివారం జరిగింది.ఈ సమావేశానికి జి. మంగతాయారు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని అన్నారు. 2024 ఫిబ్రవరి 9వ తేదీన ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవో ను, సర్క్యులర్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆశా వర్కర్లకు సంబంధంలేని ఎన్ఐఈపి ఇతర కొన్ని ఆన్లైన్ వర్కులు చేస్తున్నారని ఉదయం నుండి సాయంత్రం వరకుఆశా వర్కర్లను సబ్ సెంటర్ల వద్ద కూర్చోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు.ఆశ వర్కర్లకుఒక గంట అనుమతి ఒకరోజు సెలవు కావాలన్నా అధికారుల దయా దక్షిణాలపై ఆధారపడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని



కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌గా పని చేస్తున్న వారిని ఆశా వర్కర్లుగా తీసుకోవాలని, ఆశా వర్కర్లకు సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోని ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి పోసమ్మ, సభ్యులు జి.భవాని,ఎం. బేబీ, గంగాదేవి, పోసి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భవిషత్ కోసం బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వం

### మంత్రి కొలుసు పార్ధసారధి



**ఆగిరపల్లి, మేజర్‌న్యూస్:** రాబోయే 5 సంవత్సరాలలో రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆగిరపల్లి మాండలం కొత్త ఈదర ,ఈదర గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన మంత్రి కొత్త ఈదరలో 14 లక్షల సి, సి, రోడ్లు, ఈదరకో 19,17 లక్షలతో శంకుస్థాపనలు చేసిన మంత్రి తదనంతరం ఆగిరపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి 100 రోజుల్లో ఎన్ .డి. ఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను తెలియజేసి, అక్కడ ప్రజల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, ప్రమాణస్వీకారం అయినవెంటనే 3 వేల రూపాయలు పెన్షన్ ను 4 వేల రూపాయలకు పెంచడమే కాక 3 నెలల బకాయిలను కలిపి అందించామన్నారు. పేదల ఆకలిని తీర్చేందుకు 5 రూపాయలకే నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్నా క్యాంటీన్లను ప్రారంభించా మన్నారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేసిందని, ఒక్క ఉపాధ్యాయుల పోస్టును కూడా భర్తీ చేయకుండా పాఠశాలలకు రంగులు వేయడానికే ప్రాధాన్యతను ఇచ్చిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసినవెంటనే 16 వేల 700 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ని ప్రకటించారని, వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించేనాటికి కొత్తగా నియామకం చేసిన ఉపాధ్యా యులు బాధ్యతలు చేపడతారన్నారు. దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ చేస్తామని, మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం పథకంను అమలుచేస్తామన్నారు. గత ప్రభుత్వం సాగునీటి శాఖను, లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పరిశ్రమల ఏర్పాటును నిర్లక్ష్యం చేసిన కారణంగా అభివృద్ధి కుంటుపడిందని, సరైన రోడ్ల సౌకర్యాలు లేని కారణంగా ఎంతోమంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ముందుకు రాలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని పట్టాలెక్కించడానికి విజన్ గల నాయకుడు నారా చంద్రబాబునా యుడు ఒక్కడే అని నమ్మి ప్రజలు రికార్డు స్థాయిలో సీట్లు అందించార న్నారు. ఇటీవల వచ్చిన వరదల సమయంలో ప్రతిపక్ష నాయకుడు కేవలం విమర్శలకు పరిమితమైతే, 70 ఏళ్ల వయస్సులో కూడా బురదలో కూడా ముంపు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ట్రాక్టర్లు, ప్రొక్లైనర్ల ఎక్కి ప్రజలకు సహాయ కార్యక్రమాలను అందించి విపత్తు కాలంలో ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న భరోసాను ప్రజల్లో ముఖ్యమంత్రి కల్పించారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించామని మంత్రి చెప్పారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి పార్ధసారధి తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తెలుగుదేశం జనసేన, బి, జె, పి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఆక్వా రైతులను ఆదుకోవాలి



**భీమడోలు,మేజర్‌న్యూస్:** కొల్లేరు వరదల వల్ల వేలాది ఎకరాల విస్తీర్ణంలో గల ఆక్వా ఉత్పత్తులను నష్టపోయిన రైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ కోరారు. భీమడోలు లోని సిఐటియు కార్యాలయంలో శనివారం రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట భాస్కరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, కొల్లేరు ప్రాంతంలో ఆక్వా పెంపకం దారులు వాతావరణ మార్పులతో పాటు వరదల వల్ల పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. రొయ్యలు,చేపల ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరను ప్రకటించాలని, ఆక్వా చెరువులకు విద్యుత్ సబ్సిడీ ని కొనసాగించడంతోపాటు, యూనిట్. విద్యుత్ ను రూ. 1.50 కు సరఫరా చేయాలని కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు మాట్లాడుతూ, కొల్లేరు వరదల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కొల్లేరు ప్రాంతవాసులను ఆదుకునేందుకు మిత్ర,. శ్రీ రామకృష్ణయ్య కమిటీల సూచనలను అమలు చేయాలని తెలిపారు.

# మహిళా సర్పంచ్‌ను దుర్భాషలాడిన జన సైనికుడుపై చర్యలు తీసుకోండి

### సర్పంచ్ సున్నం వరలక్ష్మి



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** గిరిజన మహిళా సర్పంచ్ అని కూడా చూడకుండా తనపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దుర్భాష లాడిన జనసేన మండల కార్యదర్శి వీరంకి వెంకటేశ్వర రావుపై అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సున్నం వరలక్ష్మి కోరారు. శనివారం రాచన్న గూడెంలోని ఆమె నివాసంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గతనెలలో గ్రామపంచాయతీ కార్యాలయంవద్ద గ్రామసభను ఏర్పాటు చేశామని ఆసమావేశానికి వచ్చిన జనసైనికుడు వీరంకి వెంకటేశ్వరరావు తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అధికారంలో ఉందని తాను ఏం చెబితే అదే చేయాలి తప్ప సర్పంచ్‌గా వ్యక్తిగత నిర్ణయం తీసుకుంటే సహించబోమంటూ జన సైనికుడు హెచ్చరిక చేసినట్లు సర్పంచ్ వరలక్ష్మి పేర్కొన్నారు. గ్రామ సభలో సుమారు రెండు వందల మందికిపైగా పంచాయతీ ప్రజలు ముందు దుర్భాషలాడటంతో మనస్థాపం చెంది జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టానని తెలిపారు.అయినా అతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

తాను రెండు పర్యాయాలుగా సర్పంచ్‌గా ప్రజాసేవ చేస్తున్నానని గ్రామ పంచాయతీలో ఎప్పుడు ఇటువంటి పరిస్థితి ఎదుర్కోలేదని అన్నారు. ఇటువంటి వ్యక్తులు పార్టీలో ఉంటేఆ పార్టీకే చెడ్డ పేరు వస్తుందని అన్నారు.

తనపై దౌర్జన్యంగా దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై అధికారులు విచారణ చేసి పార్టీ క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని తాను పెట్టిన కేసుపై విచారణ చేయాలని కోరుతున్నట్లు తెలిపారు.

దీనిపై జన సైనికుడు వీరంకి వెంకటేశ్వరరావును వివరణ కోరగా కూటమి ప్రభుత్వం ఇచ్చే నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాలలో సమానంగా అభివృద్ధి చేయాలని గ్రామ సభలో అడిగిన మాట వాస్తవమేనని, దురుసుగా ప్రవర్తించలేదని తెలిపారు.